అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 319 | వరంగల్ | శనివారం, 26 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07









కాకతీయ సామ్రాజ్య లక్ష్మీగా పద్మాక్షి

హిందూ, జైన సమ్మేళనం పద్మాక్షి దేవాలయం

5

కాకతి వారసుల అక్షరాభ్యాస నిలయం

ఆలయంలో జైన సంస్కృతి ఆనవాళ్లు

కొండల మధ్య కొలువైన అమ్మవారు

పర్యాటకుల ఆదరణ కరువైన అద్భుత ఆలయం



కాకతీయుల కాలం నుంచి నేటి భక్తి సంప్రదాయం వరకు ఓ చారిత్రక వారసత్వ ముద్రలు చాలా ఉన్నాయి. హన్మకొండ నగరానికి చారిత్రక గుర్తింపునిచ్చే ప్రాచీన కట్టడాల్లో శ్రీ పద్మాక్షి దేవాలయం ఒకటి. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయం భక్తి, శిల్పకళ, శాసన సంపద, జైన సంప్రదాయ ఆనవాళ్లను ఒకే చోట చూపించే విశిష్ట వారసత్వ క్షేత్రంగా నిలిచింది. హన్మకొండ నగరం నడిబొడ్డున, బస్ స్టేషన్ కు కిలోమీటరు దూరంలో ఉన్న ఈ అద్భుత ఆలయం చరిత్ర పరంగా, ప్రకృతి పరంగా ఆహ్లాదాన్ని పరిచే ఈ ఆలయం కాకతీయుల కాలంలో పద్మాక్షి ఆరాధ్య దైవంగా ఉండేది. వారి వారసులకు విద్యాభ్యాసం కోసం చేసే తొలి పూజలకు అమ్మవారు మహా ఆశీర్వాదం అందించేవారని చరిత్ర చెప్తున్నది. అందమైన కొండల మధ్యలో కొలువైన పద్మాక్షి ఆలయం చూడడానికి అద్భుతంగా, ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. కానీ ఇంత గొప్ప ఆలయాన్ని చాలా మంది చూడలేదు. అన్ని వసతులు ఉన్న ఈ ఆలయం ప్రచారంలోకి తేవాల్సిన అవసరం చాలా ఉంది. సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పద్మాక్షి ఆలయంపై అక్షరశక్తి ప్రత్యేక కథనం.

- అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెంచాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- పరకాల 100 పడకల ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభం
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

4

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఓపీ సేవలను ప్రారంభించారు. అంతకుముందు ఆసుపత్రి వద్ద గణపతి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఫార్మసీ, జనరల్ వార్డు, గైనకాలజీ, ఏఎన్‌సీ, ల్యాబొరేటరీ తదితర విభాగాలను ప్రారంభించారు. *- అక్షరశక్తి, పరకాల*





అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

అక్షరశక్తి,హనుమకొండ: జేఎన్ఎస్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న 12వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. జేఎన్ఎస్ క్రీడా మైదానం క్రీడాకారులకు ఒక వరమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో విజయం సాధించడం ఎంత ముఖ్యమో, పోటీల్లో పాల్గొనడం కూడా అంతే గొప్ప విషయమని అన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తూ తమ ప్రతిభను చాటుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో కోఆర్డినేటర్ల నియామకం



అక్షరశక్తి,హనుమకొండ: సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాలలో పలు పీజీ కోర్సులకు కోఆర్డినేటర్లను నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రసాయన శాస్త్రం పీజీ కోర్సు కోఆర్డినేటర్‌గా డాక్టర్ పి. దేవేందర్, వృక్షశాస్త్రం పీజీ కోర్సు కోఆర్డినేటర్‌గా డాక్టర్ డి. శ్రీనివాసును నియమించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, పీజీ కోర్సుల నిర్వహణను మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు కోఆర్డినేటర్ల నియామకం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అధ్యాపకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతనంగా నియమితులైన కోఆర్డినేటర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కళాశాల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్.ఎన్. రహమాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి

అక్షరశక్తి, మహబూబాబాద్, సెప్టెంబర్ 26 : వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నాగలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం కోసం చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె చూపిన ధైర్యసాహసాలు, స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సీహెచ్. సాయిశ్రీజ, వసతి గృహ సంక్షేమ అధికారులు, జిల్లా అధికారులు, ఐడీఓసీ కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కుల గణనలో శాస్త్రీయ విధానం అవసరం

- **ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఇవ్వాలి: డాక్టర్ పరికిపండ్ల అశోక్**

అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబర్ 26: 2027 జనగణనలో కుల గణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని బీసీ ఉద్యమ నాయకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించి, డిజిటల్ డ్రాప్‌డౌన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. శనివారం ఎస్ఆర్ఆర్ తోటలో భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన బీసీ చైతన్య కార్యక్రమంలో 'ఓపెన్ కాస్ట్ కాలమ్-క్లోజ్డ్ జస్టిస్: ది ఇన్‌జస్టిస్ ఇన్ సెన్సస్ 2027' అంశంపై ఆయన మాట్లాడారు. కుల గణనలో ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు ఉండాలని అశోక్ అన్నారు. 2026 ఆగస్టు 14న రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని ప్రశ్న నెం.10లో ఓబీసీ కేటగిరీని స్పష్టంగా పేర్కొనక పోవడం ఆందోళనకరమని తెలిపారు. ప్రశ్న నెం.10ను సవరించి ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ కేటగిరీని చేర్చాలని కోరారు. ఓపెన్ ఎండెడ్ విధానంలో కులాలను నమోదు చేస్తే ఒకే కులం వివిధ పేర్లు, పర్యాయపదాలు, ప్రాంతీయ పేర్లు, ఉపకులాల పేర్లతో నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు. దీంతో తుది డేటాలో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక ప్రామాణిక కోడ్ కేటాయించి, డ్రాప్‌డౌన్ ఆధారిత డిజిటల్ కోడింగ్ విధానాన్ని అమలు



చేయాలని సూచించారు. ఎన్యూమరేటర్లకు ముందస్తుగా సాంకేతిక శిక్షణ ఇవ్వాలని కోరారు. కుల గణన డేటా భవిష్యత్తులో విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయ విధానాలకు కీలకమని అన్నారు. జనగణన ప్రారంభానికి ముందే ప్రశ్నావళి, కులాల జాబితా, కోడింగ్ విధానం, శిక్షణ మార్గదర్శకాలను పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించేందుకు ప్రశ్నావళిలో కులాల జాబితాతో కూడిన డ్రాప్‌డౌన్ మెనూను చేర్చాలని అన్నారు. బీహార్, తెలంగాణలో జరిగిన సర్వేలలో ఇలాంటి విధానాన్ని అవలంబించారని తెలిపారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల జాబితాలు, ఆంత్రపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డేటా ఆధారంగా కులాల జాబితాను రూపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో విశ్రాంత కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్, పద్మ బ్రాహ్మణ సంఘం నాయకుడు మలిపెద్ది కృష్ణశాస్త్రి, దూదేకుల సంఘం రాష్ట్ర నాయకుడు జావేద్, కృష్ణ యాదవ్, రమేష్ నాయి బ్రాహ్మణ, వీరన్న నాయక్, సావిత్రిబాయి పూలే సంఘం రాష్ట్ర నాయకురాలు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పాండవుల గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షరశక్తి, రేగొండ, సెప్టెంబర్ 26: చారిత్రక, ప్రకృతి సౌందర్యానికి నిలయమైన పాండవుల గుట్టను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రేగొండ మండలం తిరుమలేగిరి గ్రామ శివారులోని పాండవుల గుట్ట వద్ద జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్‌గౌడ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రకృతి, చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. పాండవుల గుట్టకు చారిత్రక, పురావస్తు ప్రాధాన్యతతో పాటు ప్రకృతి అందాలు ఉన్నాయని తెలిపారు. గుట్టపై పురాతన శిలాచిత్రాలు, మహాభారత కాలాన్ని గుర్తుచేసే ఆనవాళ్లు ఉన్నాయని,



సమీపంలోని కోనేరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని చెప్పారు. బుగులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం గుట్టపైకి వెళ్లే మెట్లను వెడల్పు చేయడం, నీడ కోసం పిల్లర్లు, స్లాబ్ నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. బుగులోని జాతరకు వచ్చే భక్తుల రాకపోకల కోసం రహదారి అభివృద్ధికి సుమారు రూ.10 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలను పరిరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గుట్ట పరిసరాలను పరిశీలించారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పర్యాటక శాఖ అధికారులు, కొడవటంచ ఆలయ కమిటీ చైర్మన్ నాయినేని సంపత్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఓయూలో అక్టోబర్ 4న మాల విద్యార్థి, నిరుద్యోగులు, ఉద్యోగుల సభ

కేయూ మొదటి గేటు వద్ద పోస్టర్ ఆవిష్కరించిన గుండు రాజేష్

అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : రోస్టర్ సవరణ సాధనకై అక్టోబర్ 4వ తేదీన హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలోని రాగూర్ ఆరిటోరియంలో నిర్వహించే మాల విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగుల సభను విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ అంసా అధ్యక్షులు గుండు రాజేష్ పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించిన గోడపత్రిక (పోస్టర్)ను కేయూ మొదటి గేటు వద్ద శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండు రాజేష్ మాట్లాడుతూ.. మాల సమాజపు హక్కుల పరిరక్షణకు, రోస్టర్ వర్గీకరణలో జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దుకునేందుకు ఈ సభ అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఈ మహాసభకు ప్రతీ ఒక్క మాల విద్యార్థి, నిరుద్యోగి, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మాల విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ మాదాస్ రాహుల్ గారు సభను ఉద్దేశించి వాక్యోపదేశం చేశారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు,



కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు, పీహెచ్డీ స్కాలర్స్, పీజీ విద్యార్థులు, మరియు మాల సంఘాల, నేతలు, పాల్గొన్నారు.

NHM ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- 28న చలో కమిషనరేట్.. సమ్మె నోటీసు
- స్పందన లేకుంటే అక్టోబర్ 12 నుంచి నిరవధిక సమ్మె



అక్షరశక్తి, హైదరాబాద్, సెప్టెంబర్ 26: రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాలు, కేడర్లలో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని NHM జేఏసీ డిమాండ్ చేసింది. రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, సమాన వేతనం, పీఆర్సీ, పెండింగ్ వేతనాలు, ఇన్క్రిమెంట్లు, లాయల్టీ బోనస్, మాతృత్వ సెలవులు, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న హైదరాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయం వద్ద 'చలో కమిషనరేట్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. కార్యక్రమానికి సంబంధించి అన్ని జిల్లాల్లో డీఎంహెచ్‌వోలు, మెడికల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జీలు, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు క్యాజువల్ లీవ్ కోసం ఉద్యోగులు దరఖాస్తులు సమర్పించారు. ఈ నెల 28న కమిషనర్ కార్యాలయానికి తరలివెళ్లి సమ్మె నోటీసు అందజేయనున్నట్లు జేఏసీ తెలిపింది. ఉద్యోగ భద్రత, హక్కులు, భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందని పేర్కొంది. సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దశలవారీగా శాంతియుత నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపింది. ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరింది. స్పందన లేకుంటే అక్టోబర్ 12 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లే కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది.

ప్రధాన డిమాండ్లు

NHM ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత, పీఆర్సీ అమలు, 100 శాతం గ్రాస్ జీతం, పెండింగ్ వేతనాల చెల్లింపు, 5 శాతం ఇన్క్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్, 180 రోజుల మాతృత్వ సెలవులు, ఇన్సూరెన్స్ సౌకర్యం, కేడర్ వారీగా వేతన, సేవా సమస్యల పరిష్కారం, కంటిన్యుయేషన్/ROPపై స్పష్టత ఇవ్వాలని జేఏసీ కోరింది.

ఈ నెల 28న జరిగే చలో కమిషనరేట్ కార్యక్రమానికి ఉద్యోగులంతా శాంతియుతంగా హాజరై విజయవంతం చేయాలని NHM JAC రాష్ట్ర అధ్యక్షుడు డా. మహేందర్ రావు పుట్ట పిలుపునిచ్చారు.





విద్యార్థులకు పర్యాటక ప్యాకేజీ టూర్

- ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం



అక్షరశక్తి, ములుగు: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కలెక్టర్ మరియు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీ టూర్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల యువ టూరిజం క్లబ్‌లకు చెందిన విద్యార్థులతో పాటు ములుగు, గోవిందరావుపేట, మంగపేట, వెంకటాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. మొత్తం 145 మంది విద్యార్థులతో నిర్వహించిన ప్యాకేజీ టూర్‌ను ములుగు నూతన కలెక్టరేట్ భవనం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లాలోని చారిత్రక, పర్యాటక, అటవీ ప్రాంతాల విశిష్టతను ప్రత్యక్షంగా పరిచయం చేశారు. పర్యటనలో భాగంగా విద్యార్థులు తొలుత జాకారం శివాలయాన్ని సందర్శించారు. అనంతరం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, రామప్ప సరస్సును సందర్శించారు. ఆ తర్వాత తాడ్వాయి అభయారణ్యంలోని జలగలంచ ప్రాంతం, వ్యూ పాయింట్లను సందర్శించి ప్రకృతి అందాలను వీక్షించారు.

ఈ సందర్భంగా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ విద్యార్థులకు ఆయా ప్రాంతాల చరిత్ర, పర్యాటక ప్రాధాన్యత, అటవీ సంపద, వివిధ రకాల మొక్కలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పర్యాటక ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించడం ద్వారా విద్యార్థుల్లో చారిత్రక వారసత్వం, ప్రకృతి సంపదపై ఆసక్తి పెంపొందుతుందని తెలిపారు.





కార్యక్రమంలో జిల్లా పర్యాటక నోడల్ అధికారి ధర్మానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ్, ఇంటర్మీడియట్ విద్యాధికారి నాయిని వీరేందర్, టూరిజం లైజన్ అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, యువ టూరిజం క్లబ్‌ల ఇన్‌చార్జి అధికారులు డాక్టర్ రహీం మహమ్మద్, కందాల కార్తీక్‌రెడ్డి, చరణ్‌సింగ్, రవీందర్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను తెలుసుకోండి...

తెలంగాణ దర్శిని టూర్ ప్రారంభించిన ఆర్డీవో



అక్షరశక్తి, హనుమకొండ: విద్యార్థులు మన చరిత్రను, పర్యాటక ప్రాంతాలను, సంస్కృతి గురించి తప్పకుండా తెలుసుకోవాలని హన్మకొండ ఆర్డీవో వెంకటేష్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 27 పురస్కరించుకొని యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీ తెలంగాణా దర్శిని టూర్ ను నిర్వహించింది. ఉదయం హన్మకొండ కలెక్టరేట్ లో ఆర్డీవో వెంకటేష్ ఈ టూర్ ను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మన చరిత్ర, సంస్కృతి గురించి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానంగా చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలు తిరగడం వల్ల ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం శివాజీ మాట్లాడుతూ పర్యాటక శాఖ తరపున అనేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 27 సాయంత్రం పర్యాటక దినోత్సవం సందర్భంగా పబ్లిక్ గార్డెన్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అనంతరం తెలంగాణ దర్శిని లో భాగంగా విద్యార్థులు పద్మాక్షి దేవాలయం, అగ్గలయ్య గుట్ట, ఆర్కియాలజీ మ్యూజియం, భద్రకాళి, వేయి స్తంభాల ఆలయం ప్రాంతాలను సందర్శించారు. పద్మాక్షి దేవాలయం వద్ద హెరిటేజ్ వాక్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ ఎస్ ఎస్ అధికారి శ్రీనివాస్, విద్యాశాఖ అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షరశక్తి, టేకుమట్ల, సెప్టెంబర్ 26: మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు, మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు సంఘటితంగా ముందుకు సాగేందుకు ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు భవనాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు పొదుపుతో ప్రారంభించి స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, వడ్డీ రాయితీలు, శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ పవర్ ప్లాంట్ల వంటి ఆదాయ వనరులను మహిళా సంఘాలకు అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోనూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత ప్రధాని నరేంద్ర మోడీ రుణం తీర్చుకోవాలి

బీజేపి జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు

అక్షరశక్తి, మహబూబాబాద్: భారతదేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని బీజేపి జిల్లా అధ్యక్షుడు వల్లబు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన సేవ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణ పార్టీ ఇంచార్జ్ ఎల్లి మల్లయ్యగౌడ్ అధ్యక్షతన ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ముల్లంగి ప్రతాప్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి మదన్ నాయక్, కార్యదర్శి ఇందూ భారతి, కౌన్సిలర్ శ్రీదేవీ బాలునాయక్, పట్టణ ఉపాధ్యక్షుడు రవియాదవ్, మల్లం యశ్వంత్, శైలజ తదితరులు పాల్గొన్నారు.





బానిస సంకెళ్లను తెంచిన వీరవనిత ఐలమ్మ

మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

అక్షరశక్తి, నర్సంపేట, సెప్టెంబర్ 26: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధైర్యసాహసాలకు ప్రతీక చాకలి ఐలమ్మ అని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ భూమి, భుక్తి, బహుజన ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, బహుజనుల హక్కుల సాధనకు కృషి చేయడమే ఐలమ్మకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, జిల్లా అధికార ప్రతినిధి ఎర్ర యాకూబ్‌రెడ్డి, నర్సంపేట సొసైటీ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, కౌన్సిలర్లు బత్తిని రాజేందర్, మాదాసి రవి, ఏపూరి శ్రీనివాస్‌రెడ్డి, ఎలకంటి విజయ్‌కుమార్, కొత్తకొండ మేఘన శ్యామ్‌రాజ్, చీకటి స్వరూప ఓదేలు, వేల్పుల శ్రీలత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల పెల్లి సందీప్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధోని కీర్తన, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికసిత్ గ్రామ ప్రణాళికలపై సర్పంచులకు శిక్షణ

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అక్షరశక్తి, భూపాలపల్లి, సెప్టెంబర్ 26: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఐడీఓసీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్పంచులకు వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామపంచాయతీ, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాల మెరుగుదల వంటి పనులను గుర్తించి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అవసరాలను గుర్తించాలని సర్పంచులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సమన్వయం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. శిక్షణ ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, ప్రణాళికల రూపకల్పనపై సర్పంచులకు అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది, వివిధ మండలాల సర్పంచులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



అక్షరశక్తి, నల్గొండ జిల్లా, సెప్టెంబర్ 25: కాకులకొండారం గ్రామానికి చెందిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యదర్శి బాకీ నర్సింహా మాదిగ తండ్రి బాకీ మల్లయ్య ఇటీవల మృతి చెందడంతో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగతో కలిసి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. బాకీ మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం బాకీ నర్సింహా మాదిగ, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కావ్వంపెల్లి రవి మాదిగ, రాష్ట్ర ముఖ్య నాయకులు సప్పి పోచన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెంచాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- పరకాల 100 పడకల ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభం
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు



అక్షరశక్తి, పరకాల, సెప్టెంబర్ 26: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఓపీ సేవలను ప్రారంభించారు. అంతకుముందు ఆసుపత్రి వద్ద గణపతి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఫార్మసీ, జనరల్ వార్డు, గైనకాలజీ, ఏఎన్‌సీ, ల్యాబొరేటరీ తదితర విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆసుపత్రి ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ బిల్లులు మంజూరు చేయించామని తెలిపారు. 12 విభాగాల్లో సుమారు 27 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆసుపత్రిలో అవసరమైన అదనపు సదుపాయాలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు. పరకాల ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి ఏ ప్లస్ కేటగిరీకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్, మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, కమిషనర్ పవన్, ఆర్డీవో డీఎస్ వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, ప్రజాప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఖమ్మం మహాసభలను జయప్రదం చేయాలి

- ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు



అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబర్ 26: ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు కోరారు. శనివారం కాజీపేట కాళోజీ జంక్షన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. ఈ నెల 28న మధ్యాహ్నం 12 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుంచి ప్రజా ప్రదర్శన ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 2 గంటలకు ఎస్సార్ అండ్ బీజీఎన్‌ఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగే సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్, తెలంగాణ అధ్యక్ష కార్యదర్శులు మామిడాల భిక్షపతి, గౌని ఐలయ్యతో పాటు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్, అసోం తదితర రాష్ట్రాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. 29, 30 తేదీల్లో ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందని, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని చెప్పారు. కార్పొరేట్ వ్యవసాయం, బలవంతపు భూసేకరణ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు, రుణమాఫీ చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, పర్యావరణం తదితర అంశాలపై చర్చలు ఉంటాయన్నారు. రైతులు, కూలీలు, వివిధ వర్గాల ప్రజలు మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి బండి వెంకటేశ్వర్లు, నాయకులు ఇనుముల కృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకుడు బండి కుమార్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగుల రంజిత్ కుమార్, అఖిల్, జట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జయశ్రీకి అండగా ఉంటాం

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేడరాజు రమాదేవి



అక్షరశక్తి, హనుమకొండ, సెప్టెంబర్ 26: అత్త మీరాబాయి వేధింపులకు గురై ఇంట్లో బంధించబడ్డారని ఆరోపిస్తున్న గూడూరు జయశ్రీ కుటుంబానికి అండగా ఉంటామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేడరాజు రమాదేవి తెలిపారు. రాంనగర్‌లో జయశ్రీ చేస్తున్న నిరసన శనివారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించి జయశ్రీ, ఆమె కుమార్తె తేజస్వితో కిటికీలోంచి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇంటి ఎదుట నిరసన చేస్తున్న జయశ్రీ కుమారుడు కార్తీక్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. జయశ్రీ, ఆమె కుమార్తె ఐదు రోజులుగా తిండి, నిద్ర లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జయశ్రీని ఇంట్లో బంధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మీరాబాయిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ వ్యవహారంపై పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో సోటరీ డాక్యుమెంట్ ద్వారా జయశ్రీ, ఆమె పిల్లలకు రాసిచ్చిన ఇల్లు, ఇతర ఆస్తులు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు అడుప తార, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సంగెం స్వరూప, జిల్లా నాయకురాలు తాటికొండ సద్గుణ, మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, దళిత ప్రజా సంఘం నాయకుడు పోలేపాక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ, జైన సమ్మేళనం

పద్మాక్షి దేవాలయం



కాకతీయ సామ్రాజ్య లక్ష్మీగా పద్మాక్షి

కాకతి వారసుల అక్షరాభ్యాస నిలయం

ఆలయంలో జైన సంస్కృతి ఆనవాళ్లు

కొండల మధ్య కొలువైన అమ్మవారు

పర్యాటకుల ఆదరణ కరువైన అద్భుత ఆలయం

అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి :

కాకతీయుల కాలం నుంచి నేటి భక్తి సంప్రదాయం వరకు ఓ చారిత్రక వారసత్వ ముద్రలు చాలా ఉన్నాయి. హన్మకొండ నగరానికి చారిత్రక గుర్తింపునిచ్చే ప్రాచీన కట్టడాల్లో శ్రీ పద్మాక్షి దేవాలయం ఒకటి. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయం భక్తి, శిల్పకళ, శాసన సంపద, జైన సంప్రదాయ ఆనవాళ్లను ఒకే చోట చూపించే విశిష్ట వారసత్వ క్షేత్రంగా నిలిచింది. హన్మకొండ నగరం నడిబొడ్డున, బస్ స్టేషన్ కు కిలోమీటరు దూరంలో ఉన్న ఈ అద్భుత ఆలయం చరిత్ర పరంగా, ప్రకృతి పరంగా ఆహ్లాదాన్ని పరిచే ఈ ఆలయం కాకతీయుల కాలంలో పద్మాక్షి ఆరాధ్య దైవంగా ఉండేది. వారి వారసులకు విద్యాభ్యాసం కోసం చేసే తొలి పూజలకు అమ్మవారు మహా ఆశీర్వాదం అందించేవారని చరిత్ర చెప్తున్నది. అందమైన కొండల మధ్యలో కొలువైన పద్మాక్షి ఆలయం చూడడానికి అద్భుతంగా, ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. కానీ ఇంత గొప్ప ఆలయాన్ని చాలా మంది చూడలేదు. అన్ని వసతులు ఉన్న ఈ ఆలయం ప్రచారంలోకి తేవాల్సిన అవసరం చాలా ఉంది. సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పద్మాక్షి ఆలయంపై అక్షరశక్తి ప్రత్యేక కథనం.

శతాబ్దాల చరిత్ర...

పద్మాక్షి దేవాలయం 12వ శతాబ్దం తొలి పాదానికి చెందినది. హన్మకొండలోని ఒక గుట్టపై వెలసిన పద్మాక్షమ్మను స్థానిక భక్తులు ఎంతో ఆరాధనతో కొలుస్తారు. కాకతీయుల పాలనలో హన్మకొండ ఒక ముఖ్యమైన రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా ఎదిగింది. కాకతీయ రాజుల కాలంలో ఈ ప్రాంతంలో అనేక ఆలయాలు నిర్మించబడి, శిల్పకళకు విశిష్ట స్థానం లభించింది. నేటికీ హన్మకొండ, వరంగల్ పరిసరాల్లో కనిపించే వేయి స్తంభాల దేవాలయం, పద్మాక్షి దేవాలయం తదితర కట్టడాలు ఆ కాలపు నిర్మాణ నైపుణ్యాన్ని చాటుతున్నాయి. పద్మాక్షి దేవాలయం కూడా ఇదే చారిత్రక వాతావరణంలో రూపు దిద్దుకున్నది. సహజ సిద్ధంగా ఏర్పడిన గుట్టపై నిర్మించబడిన ఆలయ స్థానం, దాని చుట్టూ కనిపించే రాతి నిర్మాణాలు, శిల్పాలు ఈ ప్రాంతంలోని మధ్యయుగ చరిత్రను మన కళ్లముందు నిలుపుతాయి.







జైన సంప్రదాయంతో పద్మాక్షి గుట్టకు అనుబంధం

పద్మాక్షి దేవాలయ చరిత్రలో అత్యంత విశిష్టమైన అంశం జైన సంప్రదాయానికి సంబంధించిన శిల్పాలు, శాసనాల ఉనికి. ఆలయ ప్రాంగణంలోని ప్రసిద్ధ అన్నకొండ స్తంభం ఈ చారిత్రక సంబంధానికి ముఖ్యమైన ఆధారంగా గుర్తించబడుతోంది. నల్ల గ్రానైట్‌తో రూపొందించిన ఈ స్తంభం చతురస్రాకారంలో ఉంటుంది. దాని నాలుగు ముఖాలపై చెక్కిన శిల్పాలు, శాసనాలు జైన సంప్రదాయానికి సంబంధించిన అంశాలను ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా కలలయ దేవతకు సంబంధించిన జైన సంప్రదాయ సూచనలు ఇందులో కనిపిస్తాయి.

పద్మాక్షి గుట్టను కేవలం ఒక ఆలయ ప్రాంగణంగా కాకుండా, మధ్యయుగ తెలంగాణలోని బహుమత సంప్రదాయాలు, కళా సంస్కృతుల పరస్పర సంబంధాలకు సంబంధించిన చారిత్రక స్థలంగా కూడా నిలబెడుతుంది.




భక్తి, సంస్కృతి సమ్మేళనం...

పద్మాక్షమ్మ ఆరాధన కాలక్రమంలో పద్మాక్షి గుట్టపై అమ్మవారి ఆరాధన ప్రధానంగా కొనసాగుతూ వచ్చింది. నేడు పద్మాక్షమ్మగా ప్రసిద్ధి చెందిన అమ్మవారిని స్థానిక భక్తులు తల్లిగా భావించి పూజిస్తారు. ఇక్కడ భక్తి సంప్రదాయంలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా బతుకమ్మ పండుగ సమయంలో మహిళలు బతుకమ్మ ఆడి, పాడి పెద్ద సంఖ్యలో పద్మాక్షమ్మను దర్శించుకోవడం ఈ ఆలయానికి ఉన్న సామాజిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది.

శిల్పం–శాసనం–భక్తి కలయిక

పద్మాక్షి దేవాలయం ప్రత్యేకతను ఒకే అంశంతో వివరించడం కష్టం. ఒకవైపు కాకతీయుల కాలం నాటి ఆలయ సంప్రదాయం, మరోవైపు జైన శిల్పాలు, శాసనాలు, మరోవైపు నేటికీ కొనసాగుతున్న పద్మాక్షమ్మ ఆరాధన. ఈ మూడు అంశాలు కలిసిన వారసత్వ ప్రదేశంగా ఇది కనిపిస్తుంది. హన్మకొండ పరిసరాల్లో కాకతీయుల కాలంలో నిర్మాణ కళ అత్యున్నత స్థాయికి చేరుకుంది. అదే కాలంలో మతపరమైన వైవిధ్యానికి కూడా ఈ ప్రాంతం కేంద్రంగా ఉన్నట్లు వివిధ చారిత్రక ఆనవాళ్లు సూచిస్తున్నాయి. పద్మాక్షి గుట్టపై కనిపించే జైన సంబంధిత శిల్పాలు ఈ చారిత్రక వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ముఖ్యమైన ఆధారాలు.





చరిత్రకు సాక్షి.... పద్మాక్షి

హన్మకొండ కేవలం ఒక ఆధునిక నగరం మాత్రమే కాదు. కాకతీయుల ఎదుగుదలతో ఇది దక్షిణ భారత చరిత్రలో కీలక ప్రాంతంగా మారింది. అనంతరం కాకతీయుల రాజధాని వరంగల్ వైపు మారినప్పటికీ, హన్మకొండలోని అనేక కట్టడాలు కాకతీయుల తొలి రాజకీయ, సాంస్కృతిక వికాసానికి సాక్ష్యాలుగా మిగిలాయి. పద్మాక్షి దేవాలయం, వేయి స్తంభాల దేవాలయం వంటి కట్టడాలు ఒకదానికొకటి సమీపంలో ఉండటం వల్ల హన్మకొండను కాకతీయుల వారసత్వాన్ని అధ్యయనం చేయడానికి ముఖ్యమైన ప్రాంతంగా నిలబెడుతున్నాయి.


చరిత్రను మోస్తున్న నేటి క్షేత్రం శతాబ్దాలు గడిచినా పద్మాక్షి దేవాలయం తన ప్రాధాన్యాన్ని కోల్పోలేదు. ఒకవైపు భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుండగా, మరోవైపు చరిత్ర, పురావస్తు, శిల్పకళపై ఆసక్తి ఉన్నవారికి ఈ క్షేత్రం విలువైన అనుభవాన్ని అందిస్తుంది. హన్మకొండకు వచ్చే పర్యాటకుల కోసం తెలంగాణ పర్యాటక శాఖ కూడా పద్మాక్షి దేవాలయాన్ని ముఖ్యమైన దర్శనీయ ప్రదేశంగా బ్రోచర్ లో ముద్రించింది.

వారసత్వాన్ని కాపాడుకుందాం..

పద్మాక్షి దేవాలయం వంటి చారిత్రక కట్టడాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాదు. అవి గత తరాల నిర్మాణ నైపుణ్యం, శిల్పుల ప్రతిభ, అప్పటి సమాజ జీవన విధానం, మతపరమైన పరిణామాలు, సాంస్కృతిక మార్పులకు సంబంధించిన సజీవ ఆధారాలు. అందువల్ల ఇక్కడి ప్రాచీన శిల్పాలు, శాసనాలు, స్తంభాలు, రాతి నిర్మాణాలను సంరక్షించడం భవిష్యత్ తరాలకు చరిత్రను అందించడమే అవుతుంది. పద్మాక్షి గుట్టపై నిలిచిన ప్రతి రాయి కాకతీయుల కాలం నాటి ఒక కథను చెబుతున్నట్లుగా కనిపిస్తుంది. కాకతీయుల కాలపు నిర్మాణ సంప్రదాయం, జైన సంప్రదాయపు శిల్ప-శాసన ఆనవాళ్లు, అన్నకొండ స్తంభం ప్రత్యేకత, పద్మాక్షమ్మపై కొనసాగుతున్న భక్తి—ఇవన్నీ కలిసి ఈ క్షేత్రానికి ప్రత్యేకమైన చారిత్రక స్వరూపాన్ని ఇచ్చాయి. శతాబ్దాల చరిత్రను తనలో దాచుకున్న పద్మాక్షి గుట్ట, హన్మకొండ గత వైభవాన్ని నేటి తరానికి పరిచయం చేస్తూనే ఉంది. భక్తి, చరిత్ర, శిల్పకళ, సంస్కృతి—ఈ నాలుగు అంశాల సంగమంగా పద్మాక్షి దేవాలయం తెలంగాణ వారసత్వ పటంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. విశిష్టత ఉన్న ఈ ఆలయాన్ని సందర్శించి గొప్ప అనుభూతిని మూటకట్టుకోవచ్చు.

బతుకమ్మ కు వేదిక

ఇప్పుడు నగరంలోని మహిళలకు బతుకమ్మ పండుగ అనగానే పద్మాక్షి గుర్తుకు వస్తుంది. ఇప్పటికీ కాకతీయుల కాలంలో నిర్మించిన నీటి గుండంలో బతుకమ్మను సగనంపడం అనవాయితి. కానీ కలుషితం అయిన పద్మాక్షి గుండాన్ని శుభ్రం చేసి పర్యాటక ఆకర్షణ పెంచాలని ప్రజలు కోరుకుంటున్నారు.





భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు

అక్షరశక్తి, ఖిల్లా వరంగల్, సెప్టెంబర్ 26: విద్యార్థులు, యువత భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో కుల, మత, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు పిలుపునిచ్చారు. శనివారం ఖిల్లా వరంగల్ చమన్ సెంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ, పీవైఎల్, టీయూసీఐ, ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వారోత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ సంస్థల వ్యవస్థపై ప్రభావం పెరుగుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ వాతావరణం ఆందోళనకరంగా మారాయని అన్నారు. పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నించడంలో విద్యార్థులు, యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మైదం పాణి, టీయూసీఐ నగర కార్యదర్శి బొల్లా రమేష్, బెల్లంకొండ కరుణాకర్, సంగిరెడ్డి సతీష్, పీవైఎల్ నగర నాయకులు సాబిరికాని మోహన్, లక్క మురళి, పీడీఎస్‌యూ నగర నాయకులు సిద్ధార్థ, కార్తీక్, సుమన్, రాజు, వీరేందర్, వంశీ, కీర్తన, జ్యోతి, సుమలత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ అభినందనలు



అక్షరశక్తి, హసన్‌పర్తి, సెప్టెంబర్ 25: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ. రాజశేఖర్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ రాజశేఖర్ భుజాలపై మూడు పట్టీలు తగిలించి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ రాజశేఖర్ విధులను నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించి పదోన్నతి పొందారని కొనియాడారు. భవిష్యత్తులోనూ అదే సేవా భావంతో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐలు దేవేందర్, శీలం రవి, పొన్నాల గోవర్ధన్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, తోటి కానిస్టేబుళ్లు పాల్గొని రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దోపిడీ–అణచివేతపై ఐలమ్మ పోరాట స్ఫూర్తి

నర్సంపేట రజక సంఘం అధ్యక్షుడు కొల్లూరు లక్ష్మీనారాయణ



అక్షరశక్తి, నర్సంపేట, సెప్టెంబర్ 26: భూస్వామ్య దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయమని నర్సంపేట పట్టణ రజక సంఘం అధ్యక్షుడు కొల్లూరు లక్ష్మీనారాయణ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యుడు గడ్డమిది బాలకృష్ణ మాట్లాడుతూ భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం పేదలు, రైతులు, కూలీలకు నేటికీ స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. భూమి, ఉపాధి, కనీస వేతనాలు, తాగునీరు, ఇళ్లు, విద్య, వైద్యం, సామాజిక భద్రత వంటి మౌలిక హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లేష్, ఇల్లందుల సాంబయ్య, పున్నం రాజు, వావిళ్ల ఈశ్వర్, గుడికందుల సదానందం, కొల్లూరి మధుకర్, కుర్ర రాహుల్, జిల్లా పెళ్లి దినేష్, స్వామి బాబు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఈసీని పదవి నుంచి తొలగించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు





అక్షరశక్తి, హనుమకొండ: ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఓటు హక్కును కాలరాస్తోందని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఓట్లు తొలగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం, కర్రె లక్ష్మణ్, జక్కు రాజుగౌడ్, నకిర్త ఓదెలు, వేల్పుల సారంగపాణి, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, మాలోతు శంకర్‌నాయక్, రాసమల్ల దీనా, కొట్టె వెంకటేశ్, మాలోతు మంగ, నోముల కిషోర్, గోకల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధతోనే దీర్ఘకాల చురుకుదనం

- **క్రీడలు, క్యాన్సర్ చికిత్సలో నొప్పి నిర్వహణ కీలకం: డీజీపీ సీవీ ఆనంద్**



హైదరాబాద్, సెప్టెంబరు 26, అక్షరశక్తి: క్రీడల సమయంలో తగిలే గాయాలు, క్యాన్సర్ చికిత్సలో ఎదురయ్యే నొప్పి, ప్రమాదాల అనంతరం కలిగే శారీరక ఇబ్బందులకు సకాలంలో సరైన చికిత్స, నొప్పి నిర్వహణ ఎంతో కీలకమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడంతో పాటు గాయాలకు ప్రత్యేక వైద్య చికిత్స అందిస్తే వయసు పెరిగినా చురుకుగా ఉండొచ్చని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని నందిహిల్స్‌లో ఏర్పాటు చేసిన 'థ్రైవ్ పెయిన్ క్లినిక్ వెల్‌నెస్ అండ్ మోర్'ను డీజీపీ సీవీ ఆనంద్, ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. క్రీడల సమయంలో, కీమోథెరపీతో పాటు ప్రమాదాల అనంతరం వచ్చే నొప్పులకు తగిన సమయంలో వైద్య చికిత్స తీసుకోవాలని సూచించారు. గాయాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక వైద్య సేవలు పొందితే శరీరం ఎక్కువకాలం సహకరిస్తుందని చెప్పారు. చిన్ననాటి నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ పెడితే 60 ఏళ్ల వయసులోనూ చురుకుగా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్లినిక్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

అత్యాధునిక సేవలు

పెయిన్ మేనేజ్‌మెంట్ నిపుణుడు డాక్టర్ ధీరజ్‌కుమార్, డాక్టర్ అపరాజిత రేమల్ల, డాక్టర్ స్ఫూర్తి మల్లంపాటి, డాక్టర్ అనహితారెడ్డి కలిసి థ్రైవ్ పెయిన్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. నొప్పి నిర్వహణతో పాటు ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్, కన్జర్వేటివ్ థెరపీలు, అధునాతన పెయిన్ మేనేజ్‌మెంట్ సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వారు తెలిపారు.

ఆహారం.. వ్యాయామం.. ఫిజియోథెరపీ

వయసు పెరిగినా శరీరం చురుకుగా, ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ జీవన విధానంలో వెల్‌నెస్, సమతుల ఆహారం, సరైన డైట్, వ్యాయామం, ఫిజియోథెరపీకి ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచించారు. నొప్పిని భరిస్తూ ఉండటంకంటే దానికి గల కారణాన్ని గుర్తించి సకాలంలో తగిన చికిత్స పొందడం అవసరమని తెలిపారు.

కేసముద్రం పీఎస్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



అక్షరశక్తి, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ కేసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు మరియు ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్ఐ క్రాంతి కిరణ్‌తో స్టేషన్ సిబ్బంది విధుల కేటాయింపు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందితో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి రోజువారీ విధులు, గ్రామాల సందర్శనలు, బీట్ విధులు, VPO (Village Police Officer) విధుల నిర్వహణ, గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, రాత్రి గస్తీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ స్థానిక సమస్యలు, నేర ప్రవృత్తులు మరియు అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా పోలీసులకు తెలియజేసే విధంగా నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందన అందిస్తూ బాధితులకు మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు నిరంతరం అప్రమత్తంగా ఉండి, విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరును ప్రదర్శించాలని ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సిబ్బందికి సూచించారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



అక్షరశక్తి, హైదరాబాద్, సెప్టెంబర్ 26: వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. పాలకుర్తి పోరాట స్ఫూర్తిని, తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిన ధీరవనితగా ఐలమ్మ నిలిచారని పేర్కొన్నారు. మహిళా లోకానికి ఆమె ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, నేతాని శ్రీనివాస్‌రెడ్డి, సూదాటి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



భారత్ లో పర్యాటక రంగం విస్తారమైన సహజ, చారిత్రక, సాంస్కృతిక సంపద ఉన్నప్పటికీ, కొన్ని అంశాలు దాని అభివృద్ధిని పరిమితం చేస్తున్నాయి. దేశ ఆర్థిక వనరులు, జనాభా, అక్షరాస్యత, పేదరికం, రాజకీయం కారణంగా పర్యాటక అభివృద్ధి సూచీలో వెనుకబాటు కనిపిస్తున్నది.
ప్రపంచ ఆర్థిక వేదిక (World Economic Forum) 2 Travel & Tourism Development Index (TTDI)-2024 ప్రకారం 119 దేశాల ఆర్థిక వ్యవస్థల్లో భారత్ 39వ ర్యాంక్ సాధించింది. అలాగే దక్షిణాసియాలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఇది పర్యాటకుల సంఖ్య ఆధారంగా మాత్రమే ఇచ్చిన ర్యాంకు కాదు. పర్యాటక మౌలిక వసతులు, సహజ-సాంస్కృతిక వనరులు, భద్రత, వ్యాపార వాతావరణం, పర్యాటక అభివృద్ధి వంటి అంశాలను కలిపి రూపొందించిన వివరాలు ఇవి. దీనిని బట్టి చూస్తే పర్యాటక వనరులను వినియోగించుకోవడంలో మనం వెనుకబడి ఉన్నామని తెలుస్తున్నది.

పర్యాటక రంగం అంతర్గత సవాళ్లు

పరిమిత రవాణా, భద్రత వ్యవస్థ

ప్రధానంగా విదేశీ పర్యాటకులు రవాణా సదుపాయం ఉన్న ప్రాంతాలను చూడటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. విమానాశ్రయం లేదా రైల్వే స్టేషన్ నుంచి పర్యాటక ప్రదేశాలకు సులభంగా చేరుకునే రవాణా సదుపాయాలు కొన్ని ప్రాంతాల్లో పరిమితంగా ఉన్నాయి. ఇలాంటి పర్యాటక ప్రాంతాల నిర్వహణలో సమన్వయ లోపం ఎక్కువ కనిపిస్తుంది. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు, పురావస్తు, అటవీ, దేవాదాయ తదితర శాఖల మధ్య సమన్వయం చెయ్యాల్సిన అవసరం చాలా ఉంది. వచ్చిన పర్యాటకుడికి అవసరం అయిన సదుపాయాలు కల్పించడం ప్రధాన ధ్యేయంగా ఉండాలి.



అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం పరిమితం

భారత దేశం ఒక మినీ ప్రపంచం. ఇక్కడి సంస్కృతి, సహజ పర్యాటకం చాలా ఎక్కువ. కానీ భారత్‌లోని అనేక తెలియని పర్యాటక ప్రాంతాలు విదేశీ పర్యాటకులకు తగినంతగా చేరువ కావడం లేదు. విదేశీ సంబంధాలు నెలకొల్పే క్రమంలో కేవలం పర్యాటక కోణంలో ప్రపంచ సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. దీనికి గానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టూరిజం యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలి. ప్రతీ ఏట రాష్ట్రాలను యూనిట్ గా విభజించి కనీస పర్యాటక వసతులపై సమగ్రమైన పాలసీ రూపొందించి అమలుపరచాలి.



భద్రత, మానవ వనరుల కొరత...

140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో బహుభాషా టూర్ గైడ్లు, హాస్పిటాలిటీ సిబ్బంది, స్థానిక గైడ్ లు తక్కువ స్థాయిలో ఉన్నారు. వీరికి స్కిల్ ట్రైనింగ్ ఇవ్వడంలో వెనుకబాటు ఒక వైఫల్యంగా కనిపిస్తున్నది. చాలా ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతపై ఎవ్వరూ సీరియస్ గా తీసుకోవడం లేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది. టూరిస్ట్ పోలీస్ వ్యవస్థను పరిష్టం చేస్తూ, టూరిస్టులతో ఎలా మెలగాలో వివరిస్తూ స్థానిక యువతకు పోలీసు కౌన్సిలింగ్ ఇవ్వాలి. టూరిస్టుల రాక వల్ల స్థానిక ఉపాధి అవకాశాలపై వారికి అవగాహన కల్పించాలి.



మౌలిక వసతుల అసమాన అభివృద్ధి

దేశంలో అనేక ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు మంచి రహదారులు, ప్రజా రవాణా, పారిశుధ్యం, తాగునీరు వంటి సదుపాయాలు ఉన్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో ఇవి ఇంకా తగిన స్థాయిలో లేవు. పారిశుధ్యం, పరిశుభ్రత సమస్యలు - పర్యాటక ప్రదేశాల్లో చెత్త నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్లు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలు పర్యాటకులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. రాజకీయ కారణాలు, పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయంపై చాలా రాష్ట్రాల్లో సరైన అవగాహన లేకపోవడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ముఖ్యంగా గొప్ప సంస్కృతి, చరిత్ర ఉన్నటువంటి తెలంగాణా రాష్ట్రంలో పర్యాటక సూచీ పెరగడం లేదు. వసతుల కల్పనలో రాష్ట్రాలు వెనుకబడటమే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

వారసత్వ సంపద పరిరక్షణ,ఉపాధి

- చారిత్రక కట్టడాలు, చెరువులు, కోటలు, దేవాలయాలు, గిరిజన-సాంస్కృతిక సంప్రదాయాలను సంరక్షిస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం చాలా ఉంది.
- సీజనల్ పర్యాటకంపై అధిక ఆధారపడటం, వల్ల ఏడాది పొడవునా పర్యాటకులు రాకపోతే అభివృద్ధి జరగదు.
- కొన్ని ప్రాంతాల్లో ఒక నిర్దిష్ట కాలంలోనే పర్యాటకులు ఎక్కువగా వస్తారు. అలాంటప్పుడు
- సంవత్సరం పొడవునా ఆకర్షించే కార్యక్రమాలు, సర్క్యూట్లు అభివృద్ధి చేయాల్సి ఉంటుంది.
- యువతను ప్రోత్సహించి స్థానిక ఫుడ్ అండ్ సప్లై,
- క్యాంప్ ఫైర్, లోకల్ కల్చర్, గెస్ట్ రూమ్ ను పర్యాటకులకు పరిచయం చేస్తూ ఆదాయం పొందవచ్చు.
- ఏ ప్రాంతంలోనైనా స్థానికులకు గైడింగ్, హోమ్‌స్టేలు, హస్తకళలు, స్థానిక ఆహారం వంటి రంగాల్లో అవకాశాలు పెంచితే పర్యాటక అభివృద్ధి, మన దేశ తలసరి ఆదాయం మరింత స్థిరంగా ఉంటుంది.



-డా.పల్లె రవి వంశీ మోహన్
ఎడిటర్, ఎండీ
అక్షరశక్తి

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.